# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-12-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **స్వర్ణాంధ్రప్రదేశ్-2047 లక్ష్యాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.**
2. **ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని ఆర్థికంగా,పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.**
3. **రాష్ట్రంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు లాంఛనంగా ప్రారంభిస్తారు.**
4. **రాష్ట్రంలో రహదారులను జనవరి నెలాఖరు నాటికి గుంతల రహితంగా తీర్చిదిద్దుతామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.**
5. **'విబిజి-రామ్‌జీ బిల్లు- 2025' ను కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లోక్‌సభలో ఈరోజు ప్రవేశపెట్టారు.**

========================

స్వర్ణాంధ్రప్రదేశ్-2047 లక్ష్యాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ ఆరోగ్య ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అలాగే ప్రజారోగ్య నిర్వహణకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్య సేవలందించేలా అత్యున్నత స్థాయి సలహా బృందంతో అమరావతి నుంచి దృశ్య మాధ్యమ విధానంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పన మరింత పెరగాలన్నారు. వైద్య రంగంలో వివిధ ప్రమాణాలను అందుకునేలా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సూచలను అమలు చేస్తున్నామని తెలిపారు.

-------------------------

ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని ఆర్థికంగా,పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయనగరం జిల్లా భోగాపురంలో ఎడ్యు సిటీ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు,

మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

అనంతరం మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

--------------------------

ఏలూరు జిల్లాలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఈరోజు పర్యటించారు. ఇందులో భాగంగా ఏలూరు రామకోటి ప్రాంతంలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన జిల్లా పురావస్తు ప్రదర్శనశాలను మంత్రి ప్రారంభించి పురావస్తు శాఖ సేకరించిన ప్రాచీన శిలలు, పాత్రలు, కళాఖండాలు పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, మ్యూజియాల ఏర్పాటు ద్వారా వారసత్వ సంపదను భావి తరాలకు అందించవచ్చని అన్నారు. పురావస్తు ప్రదర్శనశాలలను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త భవనాలు నిర్మించడం, అంతర్జాతీయ ప్రమాణాలతో పురాతన వస్తువులను ప్రదర్శించడం వంటి చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు.

--------------------------

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రేపు తిరుపతికి రానున్నారు. ఉదయం మైసూరు నుంచి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుని హెలికాప్టర్‌లో తమిళనాడు రాష్ట్రం వేలూరులోని గోల్డెన్ టెంపుల్ ను రాష్ట్రపతి దర్శించుకుంటారని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ స్వాగతం పలుకనున్నారని..దర్శనానంతరం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానంలో హైదరాబాద్ కు రాష్ట్రపతి బయలుదేరి వెళ్ళనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గవర్నర్, రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

--------------------------

రాష్ట్రంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు లాంఛనంగా ప్రారంభిస్తారు. గుంటూరు జిల్లా మంగళగిరి బెటాలియన్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో సాయంత్రం ముఖ్యమంత్రి పాల్గొని రాష్ట్ర వ్యాప్తంగా కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తారు. అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 22 నుంచి 9 నెలల పాటు శిక్షణ మొదలుకానుంది.

--------------------------

రాష్ట్రంలో రహదారులను జనవరి నెలాఖరుకు నాటికి గుంతల రహితంగా తీర్చిదిద్దుతామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో రహదారుల పనుల పురోగతిపై మదనపల్లెలో ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో నూతనంగా మరో 200 కోట్ల రూపాయలతో రోడ్ల అభివృద్ధికి టెండర్లు పిలవనున్నామని తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని 7 నియోజకవర్గాలకు సంబంధించి 2 వేల 721 కిలోమీటర్ల రహదారుల పనులు జరుగుతున్నాయని మంత్రి పేర్కొంటూ

వాయిస్.. 25 సెకన్లు

--------------------------

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా 'వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ గ్రామీణ బిల్లు– 2025–విబిజి రామ్‌జీ' ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇరవై ఏళ్ల నాటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, 2005 –ఎమ్‌జిఎన్ఆర్ఇజిఎ స్థానంలో ఈ బిల్లు ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. కొత్త బిల్లు ప్రాధాన్యతా రంగాల ద్వారా ఉపాధి, స్థిరమైన గ్రామీణ మౌలిక సదుపాయాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. ఈ బిల్లు 2047 నాటికి వికసిత భారత్ దార్శనిక ఉద్దేశానికి అనుగుణంగా పనిచేస్తుందని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

వాయిస్ .. 20 సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కుసుమ్ యోజన, ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా చిత్తూరులో నిర్వహించిన ఇంధన పొదుపు పై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఈ రోజు ప్రారంభించారు. అనంతరం సుమిత్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలు తమ ఇళ్లపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని చెప్పారు చిత్తూరు జిల్లాలో సౌరశక్తి ద్వారా రైతులు 200 మెగా వాట్ల విద్యుత్ సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు.

---------------------------

ఉపాధి హామీ కార్యక్రమం అమలులో భాగంగా 988 కోట్ల రూపాయలను రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. 2025–26 సంవత్సరంలో ఉపాధి కార్యక్రమానికి ఇప్పటివరకు 7 వేల 669 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం అందించిందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి వెల్లడించారు. ఇందులో శ్రామికుల వేతనాలకు 5,660 కోట్లు, పనులు, పరిపాలన ఖర్చులకు మరో 2 వేల 9 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 26వ తేదీ వరకు పంపవచ్చు.

=====================